
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

మంగళవారం 23 సెప్టెంబరు 2025

అంకురార్పణకు అంతా సిద్ధం



తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తొలిఘట్టమైన అంకుర్పాణకు సర్వం సిద్ధమైంది. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఉత్సవాలు విజయవంతం కావాలంటూ ఆకాంక్షిస్తూ మంగళవారం నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య నిర్వహించే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలకు బీజం పడనుంది. ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడి పంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనులవారిని ఆలయ నాలుగు మాడవీధుల్లో తొలివాహనంగా ఊరేగిస్తారు. జగద్రక్షకుడైన శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విష్వక్సేనులవారు ఈవిధంగా మాడవీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం. మరోవైపు రుత్విక్వరణం కూడా విశేషంగా నిర్వహిస్తారు. అర్చకులకు శ్రీవారే విధులు కేటాయిస్తున్నట్టుగా భావించి ఈ తొమ్మిదిరోజుల పాటు ఎవరు ఏ విధులు నిర్వహించాలో ఈ కార్యక్రమం ద్వారా నిర్ణయిస్తారు. దీనికి సంబంధించి సోమవారం సాయంత్రానికే ప్రణాళిక సిద్ధం చేశారు.

ముస్తాబైన కొండ

బ్రహ్మోత్సవ వైభవం మంగళవారం నుంచి మొదలుకానున్న నేపథ్యంలో తిరుమల క్షేత్రాన్ని విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు. శ్రీవారి ఆనందనిలయం నుంచి మహాద్వారం వరకు, గోపురం, ప్రాకారం, ఆలయ పరిసర భవనాలు, ముఖ్య కూడళ్లు, రహదారులు, పార్కుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణను సోమవారం రాత్రి మరోసారి పరీక్షించి లోటుపాట్లను సరిచేశారు. దీంతో స్వామి క్షేత్రంలో సోమవారం నుంచే బ్రహ్మోత్సవశోభ కనిపించడం మొదలైంది.

మొదలైన సందడి

తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ తక్కువగానే ఉన్నప్పటికీ బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు, డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు, శ్రీవారిసేవకులతో తిరుమల అంతా సందడిగా కనిపించింది. బుధవారం సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో తిరుమలలో భద్రతా తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా అధికారులు, పోలీసులు, ప్రత్యేక దళాలు, బాంబ్, గాడ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేశాయి. సోమవారం రాత్రి చిరుజల్లులు పడటంతో ఉత్సవాలకు స్వామే క్షేత్రాన్ని శుభ్రపరుస్తున్నారని కొందరు భక్తులు వ్యాఖ్యానించారు.

సంతృప్తికరంగా వాహనసేవల వీక్షణ

- మాడవీధుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఆంధ్రజ్యోతితో అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఆంధ్రజ్యోతి



'తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరే భక్తులకు సంతృప్తికర వాహనసేవల దర్శనం కల్పించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాం. నిర్దేశించిన సమయానికి వాహనసేవలు నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాం. చిన్నపాటి సమస్యకు కూడా అవకాశమివ్వకుండా సూక్ష్మస్థాయిలో ప్లాన్‌ను సిద్ధం చేశాం. తిరుమలకు చేరుకుని గ్యాలరీల్లోకి రావడమే భక్తుల వంతు. మిగిలినదంతా మేమేం చూసుకుంటాం' అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి చెప్పారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్ల వివరాలు ఆయన మాటల్లోనే..

సాంకేతిక సాయంతో రద్దీ నియంత్రణ

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి క్రౌడ్ మేనేజ్మెంట్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. టీటీడీ చరిత్రలో తొలిసారిగా ఇస్రో సేవలను ఉపయోగించుకోబోతున్నాం. అలాగే భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఈసారి ఎల్అండ్‌టీ కూడా తమ సహకారం ఇవ్వబోతోంది. ఎంతమంది తిరుమలకు చేరినా ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశాం.

పక్కా ప్రణాళిక

ఈ తొమ్మిదిరోజుల ఉత్సవాలను ఎలా నిర్వహించాలనే అంశంపై ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి పక్కా ప్రణాళికలతో సూచనలు చేశాం. ముందస్తుగా తయారు చేసిన ప్లాన్ ప్రకారమే అన్నిటినీ అమలు చేయబోతున్నాం.

గట్టి భద్రత

4,700 మంది పోలీసులు, 2 వేల మంది విజిలెన్స్, వెయ్యిమంది టీటీడీ ఉద్యోగులు, 3,500 మంది శ్రీవారిసేవకులు, 2,100 మంది పారిశుద్ధ్య కార్మికులు ఇలా పదివేల మందికిపైగా భక్తులకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

గరుడసేవపై ప్రత్యేక దృష్టి

ప్రధానంగా గరుడసేవకు ఎలాంటి సమస్యల ఉత్పన్నం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. గ్యారీల్లోకి చేరే భక్తులే కాకుండా వెలుపల ఉండే యాత్రికులకూ ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశంపై దిశానిర్దేశం చేశాం. సరైనా కోఆర్డినేషన్‌తో స్వామి ఉత్సవాలను సక్సెస్ చేస్తాం.

రేపు ఉప రాష్ట్రపతి, సీఎం రాక

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమలకు బుధవారం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు రానున్నారు. బుధవారం రాత్రికి ఉప రాష్ట్రపతి దంపతులు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి తిరుమలకు చేరుకుని బస చేస్తారు. గురువారం ఉదయం 7 గంటలకు స్వామి వారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఇక, సీఎం చంద్రబాబు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి, అక్కడ్నుంచి తిరుమలకు వెళ్లనున్నారు. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించాక, పెద్ద శేష వాహనసేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం పీఏసీ-5 సముదాయాన్ని ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు. వీరిద్దరి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి తదిరులు సమీక్షించారు. వీఐపీల పర్యటన ప్రాంతాలను పరిశీలించారు.

తిరుమల వైకుంఠంలో అత్యాధునిక నిఘా వ్యవస్థ

- 25న సీఎంచే ప్రారంభం?

తిరుమల, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసేందుకు అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)ను టీటీడీ ఏర్పాటు చేసింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 25వ కంపార్టుమెంట్‌లోని ఐసీసీసీని సీఎం చంద్రబాబుతో గురువారం ప్రారంభించే యోచనలో టీటీడీ ఉంది. భక్తుల రద్దీ నియంత్రణ, దర్శనాల నిర్వహణతో పాటు సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ బెదిరింపుల నుంచి టీటీడీ వ్యవస్థను పరిరక్షించేందుకు ఇది ఉపయోగపడుతుంది. భక్తుల రద్దీని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) సాయంతో ఎప్పటికప్పుడు అంచనా వేయడం, దర్శనానికి ఖచ్చిత సమయాన్ని లెక్కకట్టడం, దర్శనానికి వచ్చే భక్తుల పూర్తి వివరాల నమోదు, హెడ్ కౌంట్ వంటివి దీనితో సులువవుతాయి. విపత్తు సమయాల్లో డ్రోన్ల ద్వారా సహాయాన్నీ ఐసీసీసీ ద్వారా చేపట్టనున్నారు. భవిష్యత్తులో క్వాంటమ్ టెక్నాలజీని వినియోగించుకునేలా ఐసీసీసీలో ముందస్తు ఏర్పాట్లు చేశారు.

ధ్వజారోహణానికి చెల్లూరు దర్భ

- దీనితో 22 అడుగుల చాప, 225 మీటర్ల తాడు



తిరుమల, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ధ్వజారోహణానికి వినియోగించే దర్భ చాప, తాడు ఊరేగింపుగా సోమవారం తిరుమల ఆలయానికి చేరాయి. టీటీడీ అటవీ విభాగం దర్భను సేకరించింది. టీటీడీ ఫారెస్ట్ డిపోలో అంతకుముందు వీటికి నిర్వహించిన పూజలో డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు. రంగనాయక మండపంలో శేషవాహనంపై వీటిని ఉంచారు. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీనలగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంలో వీటిని ఉపయోగిస్తారు.

తిరుమలలో వాడేది విష్ణుదర్భ

దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపైవరకు చుడతారు. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అని రెండు రకాలుంటాయి. తిరుమలలో విష్ణు దర్భనే వినియోగిస్తారు. ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో విష్ణుదర్భను టీటీడీ అటవీశాఖ సేకరిస్తుంది. వారం రోజుల పాటు ఎండబెట్టి శుభ్రపరుస్తారు. 22 అడుగు పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 60 కిలోల బరువైన దర్భ చాపను అల్లుతారు. 255 మీటర్ల పొడవైన 106 కిలోల తాడును పేనుతారు.



కలెక్టర్‌కు అధికారుల అభినందన

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టుకు స్కోచ్ సంస్థ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సోమవారం అధికారులు అభినందించారు. ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, డీపీవో సుశీలాదేవి అభినందనలు తెలిపారు. కలెక్టర్ కేక్ కట్ చేశారు.

ఎలక్ట్రిక్ బస్సుల్ని తిరుమలకు తిప్పాల్సిందే



మాట్లాడుతున్న ఈడీలు చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, డీపీటీవో జగదీష్

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వంద ఎలక్ట్రిక్ బస్సులనూ తిరుమలఘాట్‌లోనే తిప్పాలని ఆర్టీసీ ఈడీలు చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్ ఆదేశించారు. మదనపల్లె, నెల్లూరు, కడపలకు తిరుగుతున్న బస్సులనూ తిరుమలకు నడపాలన్నారు. తిరుపతిలో సోమవారం వీరు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. స్త్రీశక్తి పథకం నేపథ్యంలో ఎక్కువ మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గరుడసేవకు నిమిషానికొక బస్సు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. సమీక్షలో డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్తూ...

- కారు ఢీకొని తల్లీకొడుకుల దుర్మరణం





మృతి చెందిన మునెమ్మ, బాలాజీ

నారాయణవనం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వెళ్తున్న తల్లీకొడుకులను కారు ఢీకొని దుర్మరణం చెందారు. నారాయణవనం మండలం టాసా ఫ్యాక్టరీ వద్ద సోమవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా నింద్ర మండలం ఐఆర్‌కండ్రికకు చెందిన మునెమ్మ(47)ను ఆమె కుమారుడు బాలాజి(28) ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని తిరుపతిలోని ఆస్పత్రికి బయలుదేరారు. టాసా ఫ్యాక్టరీ వద్ద పాలమంగళం నుంచి వస్తున్న కారు వీరి బైకును ఢీకొనడంతో తల్లీకొడుకులు ఎగిరి రోడ్డు మీద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మునెమ్మ భర్త కేశవులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలాజి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. భార్య, కుమారుడి మృతదేహాలను చూసి విలపిస్తున్న కేశవులును ఓదార్చడం ఎవరివల్ల కాలేదు.

డ్వాక్రా సభ్యులకు రూ.11లక్షల టోకరా

తిరుపతిరూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలకు చెందిన రూ.11లక్షలకుపైగా మొత్తాన్ని ఓ సంఘమిత్ర స్వాహా చేసిన ఘటన బయటపడింది. వివరాలిలా.. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలోని ఎస్టీకాలనీలో మూడు డ్వాక్రా సంఘాలున్నాయి. ఈ సభ్యులకు తెలియకుండా రూ.11లక్షలకు పైగా సొమ్మును విడతలవారీగా సంఘమిత్ర చెంచులక్ష్మి తీసుకున్నారు. అడిగినప్పుడల్లా బ్యాంకులో చెల్లించామని చెప్పేవారు. వార్షిక బడ్జెట్- జీవనోపాధుల ప్రణాళికలో బయోమెట్రిక్ వేసిన సందర్భంలో బ్యాంకులో అప్పు ఉన్నట్లు సభ్యులు గుర్తించారు. అనుమానంతో బ్యాంకు పుస్తకాలను తీసుకురమ్మంటే సంఘమిత్ర దాటవేత ధోరణితో సమాధానం చెప్పేవారు. దీంతో బ్యాంకు స్టేట్‌మెంట్ పరిశీలించగా రూ.11లక్షలకుపైగా స్వాహా చేసినట్లు గుర్తించారు. దీనిని 'మనడబ్బులు- మనలెక్కలు' యాప్ ద్వారా ధ్రువీకరించుకున్నారు. దీనిపై మండల వెలుగు ఏపీఎం నాగేశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రూ.11లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. విచారణ జరిపి. రికవరీకి చర్యలు చేపడతామన్నారు.

25న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

- రేపు ప్రయాణానికి రిజిస్టర్ చేసుకోవాలన్న డీఈవో

తిరుపతి(విద్య), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఈనెల 25వ తేదీన అమరావతిలో సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందజేయనున్నారు. దీనికిగాను అభ్యర్థులు బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డీఈవో కుమార్ సూచించారు. అభ్యర్థితో పాటు మరో సహాయకులకు అవకాశం ఉందన్నారు. అమరావతికి తీసుకెళ్లేందుకు ప్రయాణ, భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుపతిలో నింగి నుంచీ నిఘా

- 10 డ్రోన్లు వినియోగించనున్న పోలీసులు
- పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై శ్రీవారి బ్రహ్మోత్సవాలు. భక్తులంతా తిరుపతి మీదుగానే రాకపోకలు సాగిస్తారు. ఆ రద్దీ ప్రభావం నగరంలోనూ కనిపిస్తుంది. ఈ క్రమంలో తిరుపతిలో భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటికే ఎస్పీ సుబ్బరాయుడు, డీఎస్పీ భక్తవత్సలం, ఇతర పోలీసు అధికారులతో నాలుగైదు సార్లు సమావేశమయ్యారు. ఎక్కడా తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టడంపై చర్చించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించారు. అత్యాధునిక పది డ్రోన్లతో నింగి నుంచి తిరునగరిపై నిఘా పెట్టనున్నారు. వీటిల్లో ట్రిథర్ డ్రోన్‌ను బస్టాండు, రైల్వే స్టేషన్‌లో మాత్రమే వినియోగిస్తారు. మిగిలిన థర్మల్ డ్రోన్‌ను తిరుపతి నగరమంతా వినియోగించి ఎక్కడైనా అసాంఘిక శక్తులు తలదాచుకున్నా, తొక్కిసలాటకు ఆస్కారమున్నా పరిశీలిస్తారు. అనుక్షణం భక్తుల రాకపోకలపై డ్రోన్ల ద్వారా కమాండ్ కంట్రోలు యూనిట్ నుంచి ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తాయి. ఇక, టీటీడీ వసతి సముదాయాలు, అలిపిరి బైపాస్ రోడ్డు, గరుడ, నంది సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్‌లో భక్తులు తిరగ



లాడే ప్రాంతాల్లో డీజేఐ 3ఎస్ డ్రోన్లతో పాటు హై సెక్యూరిటీ లెన్స్ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అలిపిరి చెక్ పాయింట్, గరుడ విగ్రహం, కాలినడకన వెళ్లే భక్తుల కోసం రోప్ పార్టీలు, విజిలెన్సు సిబ్బంది, పోలీసులను నియమించారు.

అదనంగా ఐదు హోల్డింగ్ పాయింట్లు

వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే వామనాలకు అదనంగా ఐదు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. దేవలోక్, బాల విజ్ఞాన్ భవన్, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండు, ఇస్కాన్ గ్రౌండులో పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశారు. ఇవి నిండిపోతే నెల్లూరు వైపు నుంచి వచ్చే వాహనాలను మామిడికాయల మండీ.. కడప నుంచి వచ్చే వాహనాలను శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల.. చిత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలను చెర్లోపల్లె వద్ద ఆపాలి. ఆయా పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, బందోబస్తు, ఫుడ్ స్టాళ్లు, టాయిలెట్లు తదితర వసతులను టీటీడీ సమకూరుస్తోంది.

700 మందితో భారీ బందోబస్తు

తిరుపతిలో 700 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో 10 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్లు, హోంగార్డులను బందోబస్తు కోసం నియమించారు. వీరు కాకుండా పారా మిలటరీ బలగాలు, రోప్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్లు, డిగ్గింగ్ పార్టీలు, మెటల్ డిటెక్టర్లు, లగేజీ తనిఖీ స్కానర్లు ఏర్పాటు చేస్తున్నారు. గరుడ సేవకు మళ్లీ అదనపు సిబ్బందిని నియమించనున్నారు.

కల్యాణ వెంకన్నకు హంస వాహనం వితరణ



చంద్రగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎన్ఆర్ఐ భక్తుడు శ్రీనివాసమూర్తి దంపతులు రూ.10 లక్షల విలువైన హంస వాహనాన్ని వితరణ చేశారు. బంగారు పూత పూయించిన హంస వాహనాన్ని వారు సేలంలో తయారు చేసించి సోమవారం ఉదయం ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలాజీరంగాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, సిబ్బంది రామకృష్ణనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



ఎర్రావారిపాలెం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహా భాగ్యమని తహసీల్దార్ పరమేశ్వర స్వామి అన్నారు. మండల కార్యాలయం ఎదుట సోమవారం కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ ససందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎయిడ్స్ సంక్రమణంపై అందరికీ అవగాహన్న ఉండాలన్నారు. ఈ వ్యాధి చాపకింద నీరు వ్యాపిస్తోందన్నారు. కోర్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలు,కళాశాలు,మార్కెట్‌లు లాంటి చోట్ల విస్తృత ప్రచారం చేస్తోందని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మదన్‌మోహన్‌రాజు, ఎండీవో-2 సతీష్ బాబు, ఐసీడీసీ సూపర్‌వైజర్ భారతి, కోర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుగ్గా స్వామిత్వ సర్వే

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వామిత్వ రెవెన్యూ సర్వే జోరుగా సాగుతుంది. 10 రెవెన్యూ గ్రామాల్లోని 245 ఆవాస ప్రాంతాల్లో మండల సర్వేయర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ ప్రక్రియ వేగమందుకుంది. ప్రతి ఇంటి కొలతలు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటికి సంబంధించి సమగ్ర వివరాలను ఇందులో నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటి ఆధారంగానే రాబోవు రోజుల్లో ఇంటి పన్ను విధించనున్నారు. సోమవారం ఉదయమాణిక్యం గ్రామంలో జరిగిన సర్వేను అధికారులు పర్యవేక్షించారు

షోడశీ దేవిగా మరకతశక్తి అమ్మ దర్శనం



రామచంద్రాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా శక్తిపీఠంలోని మరకతశక్తి అమ్మవారు షోడశీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో తొలుత అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటి లింగేశ్వరాలయంలో కలశప్రతిష్ఠ, గణపతి హోమం జరిగింది. పారకాల్వ రాజరాజేశ్వరి పీఠంలో అమ్మవారు బాలత్రిపురసుందరి దేవిగా దర్శనమిచ్చారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, రమ్యానంద భారతి, బాలాజీస్వామి, ఉభయదాతలు కఠారి భాస్కర్‌నాయుడు,వనమాలిదేవి దంపతులు పాల్గొన్నారు.

నదీపోరంబోకు స్థలంలో ఆక్రమణ..!



తాత్కాలిక రేకులషెడ్డు

తిరుపతి రూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): అవిలాల గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనంబరు 360/2లోని నదీ పొరంబోకు స్థలంలో కొందరు అదనుచూసి ఆక్రమణకు పాల్పడ్డారు. తనపల్లె నుంచి కుంట్రపాకానికి వెళ్లే రహదారిని అనుకుని ఉండడంతో ఈభూములు చాలా ఖరీదైనవి. స్వర్ణముఖీనదికి సంబంధించిన ఈస్థలంలో రాత్రికి రాత్రే తాత్కాలిక రేకులషెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. గతంలోనూ ఇదేస్థలంలో ఆక్రమణదారులు చేపట్టిన నిర్మాణాన్ని రూరల్‌మండల రెవెన్యూ అధికారులు తొలగించారు. తిరిగి కొన్ని నెలల తర్వాత ఈస్థలంలో రాత్రికి రాత్రే నిర్మాణాన్ని చేపట్టారు. తహసీల్దార్ రామాంజులనాయక్‌ని వివరణ కోరగా విచారించి ఆక్రమిత స్థలంలో నిర్మాణాన్ని తొలగిస్తామని పేర్కొన్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు



భాకరాపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లెలో స్వస్థ్ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో సోమవారం భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి తేజస్విని మాట్లాడుతూ గుండె జబ్బులు, గర్భాశయ క్యాన్సరు, మధుమేహం, కిశోర బాలికలలో రక్తహీనతను గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సక్రమంగా ఓటరు జాబితా తయారు చేయండి

భాకరాపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దారు పరమేశ్వరస్వామి సూచించారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్లను 2025 ఓటర్ల జాబితాలో సరిపోల్చి చూడాలన్నారు. జాబితాలో ఉన్న వారికి సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నివేదికలను పంపాలన్నారు. ఈనెల26లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. ఏఎస్‌వోలు కుసుమ కుమారి, రమ్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘం నేతలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఓ హోటల్లో మీడియాతో మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి బీసీలను బలోపేతం చేయడంలో భాగంగా యువత, మహిళ, ఉద్యోగ, విద్యార్థి సంఘాలను చైతన్యపరుస్తున్నామని చెప్పారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. వారి రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. చట్టసభల్లో బీసీల హక్కుల సాధన కోసం ఏ త్యాగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు కె.నారాజుగౌడ, ఆర్.కె.యాదవ్, సోమశేఖర్ మధుఆచారి, వాసుకుమార్ పాల్గొన్నారు.

ఎస్ఈకి అభినందన



తిరుచానూరు,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం ఆపరేషన్ విభాగంలో పనిచేస్తున్న వి.చంద్రశేఖర్‌రావు ఎస్ఈగా పదోన్నతి పొందారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయనను కార్యాలయంలో ఏడీఈ జయప్రకాష్, ఉద్యోగులు అభినందించారు.

ఉపరాష్ట్రపతి పర్యటనపై కలెక్టర్ సమీక్ష

రేణిగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ వెంకటేశ్వర్ భద్రతా ఏర్పాట్లపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఉపరాష్ట్రపతి తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహర్‌చారి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఐదుగురికి 6 నెలల జైలుశిక్ష

పాకాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఐదుగురికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సోమవారం జూనియర్ సివిల్ జడ్జి పి.,పూర్ణిమాదేవి తీర్పు నిచ్చారు. 2019లో చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో ఓ బంగారు దుకాణంలో వెండి చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసుల విచారణలో వాయల్పాడు మండలం చింతలవారిపల్లెకు చెందిన ఆర్.అరుణ, డి.గీత, వి.ప్రభావతి, పి.విజయకుమారి, ఆర్.మణిలు చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. కేసు సోమవారం తుది విచారణకు రావడంతో జడ్జి పూర్వాపరాలను విచారించి తీర్పునిచ్చారు. నిందితులు ముఠాగా బంగారు దుకాణంలో కొనుగోళ్లు చేస్తున్నట్లు నటించి చోరీలకు పాల్పడేవారు. కల్లూరులోని బంగారు దుకాణంలో ఒకటిన్నర కేజీ చోరీ చేసి దొరికిపోయారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రేమ్‌సాగర్ వాదనలు వినిపించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. వివరాలు ఇలా.. తలకోనలోని మర్రిమాకులపల్లె సమీపాన భాకరాపేట-ఎల్లమంద రోడ్డు వద్ద ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సోమవారం ఫారెస్ట్ అధికారులకు ముందస్తు సమాచారం అందింది. ఈమేరకు వెంటనే ఫారెస్ట్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వీరిని గమనించి డ్రయివర్ కారువేగంగా పోనిచ్చాడు. ఫారెస్ట్ సిబ్బంది వెంబడించగా కొంత దూరం వెళ్లాక వాహనాన్ని ఆపి దుండగులు పారిపోయారు. ఒకరిని పట్టుకున్నారు. నిందితుడు మునిస్వామి సతీస్ అరెరు. కారుతో సహా 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించండి: గురుమూర్తి

తిరుపతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి వివాదంపై విచారణ కోసం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి అధ్యక్షతన జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీకి చెందిన తిరుపతి ఎంపీ గురుమూర్తి సీజేఐ బీఆర్ గవాయ్‌కు సోమవారం లేఖ రాశారు. తిరుమల పరకామణి చుట్టూ అలుముకున్న వివాదంపై సుప్రీంకోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. ఎలాంటి ఆధారాలనూ చూపకుండా, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించకుండానే దొంగతనం, ఆలయ కానుకల దుర్వినియోగం వంటి తీవ్రమైన ఆరోపణలను ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి రాజకీయ ప్రతీకార చర్యలతో తిరుమల ఆలయ పవిత్రత దెబ్బతింటోందని పేర్కొన్నారు.

కళ మనిషి జీవన విధానానికి ప్రతీక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కళ మనిషి జీవన విధానానికి ప్రతీక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ - జాతీయ సంస్కృత యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్ వర్క్‌షాప్ సోమవారం చేపట్టారు. వీసీ కృష్ణమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మనిషి జీవన విధానానికి కళలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ స్థాపకులు, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాతి నిర్మాణంలో కళలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి కళంకారీ కళ అరుదైందని చెప్పారు. ఇటువంటి కళలను, కళాకారులను అందరూ ప్రోత్సహించాలని కోరారు. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ రీజినల్ డైరెక్టర్ రాఘవన్ మాట్లాడుతూ కళల్లో సృజనాత్మకత దాగుందన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ సాయిసుజాత పేర్కొన్నారు. మహిళలు - పిల్లల ఆరోగ్యంపై అక్కారంపల్లెలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే, కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వాణి మాట్లాడుతూ ప్రతి మహిళ బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్ వంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సింధు, పద్మావతి మహిళాభ్యుదయ సంఘం ఎండీ మురుగేషన్, సీఈవో ధరేంద్ర కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మోహన్, మహిళా సంఘం ప్రతినిధులు సరోజమమ్మ, శంకరి, ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ అకడమిక్ కన్సల్టెంట్లు రమణ, జగదీశ్వరి, రాజరాజేశ్వరి, సునీత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాయుడుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని రామకృష్ణాపురానికి చెందిన జూనేద్ ఈనెల 14వ తేదీ మద్యంలో గడ్డిమందు కలుపుకొని ఆత్మహత్యయత్నం చేశారు. స్థానికులు, బంధుమిత్రులు గమనించి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జూనేద్(22) మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

మృత్యుంజయుడికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించారు.



తిరుపతి నగరంలో -వజ్రకిరీటాన్ని తలపించేలా-. గరుడ సర్కిల్ వద్ద విద్యుద్దీప వెలుగులు



కపిలతీర్థం కూడలి -టీటీడీ ఏడీ భవనం ప్రాంగణం-అలిపిరి కాలిబాట ప్రవేశ మార్గంలో విద్యుత్ శోభ

తిరునగరిలో బ్రహ్మోత్సవ కాంతులు

తిరునగరిలో బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడుతోంది. విద్యుద్దీపాలంకరణ కనువిందు చేస్తోంది. వివిధ దేవతల అలంకారంలో దీపాలంకరణ అబ్బురపరుస్తోంది. టీటీడీ పరిపాలనా భవనం, నంది సర్కిల్, తిరుమల మొదటి ఘాట్ రోడ్డు, అలిపిరి మార్గం, అలిపిరి గరుడా సర్కిల్, పాదాల మండపం, చెక్‌పోస్టు, జూపార్క్ రోడ్డు, ఎస్వీ మెడికల్ కాలేజ్ వివేకానంద సర్కిల్‌తోపాటు నగర వీధులు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. **- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి**

లోకపావనీ.. బాలాత్రిపురసుందరి దేవీ నమోస్తుతే..



చంద్రగిరిలో పూజలు- బాలాత్రిపురసుందరీదేవిగా మూలస్థాన ఎల్లమ్మ, శక్తిచాముండేశ్వరిదేవి

తిరుపతి రూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):. తుమ్మలగుంట చెంచువారికాలనీలో మూలస్థాన ఎల్లమ్మ సోమవారం బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఉదయం అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించి హోమం, కుంకుమార్చన, విశేషాలంకారం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయధర్మకర్త బిరుదాల సిద్దారెడ్డి అన్నదానసేవని నిర్వహించారు. ● ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరిదేవి అమ్మవారు త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఉభయదారులుగా ప్రొఫెసర్ గీతాసాగర్, కె.పూర్ణశ్రీ, పి.వరప్రసాద్ వ్యవహరించారు.

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేకువ జామున అమ్మవారికి అభిషేకాలు చేశారు. మిట్టమీద గంగమ్మ ఆలయంలో ఉదయం అభిషేకం, గణపతి పూజ, కలశస్థాపన, అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం ఆవరణలోని గణపతిపూజ, యమునాపూజ, కళశ స్థాపన, సంతోషిమాత సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్ర ప్రత్యంగిరా కాశి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి సూరీస్వామి, భక్తులు పాల్గొన్నారు.

రేణిగుంటలో కుక్కల బీభత్సం

● పాంచాలినగర్‌లో ఆరుగురు పిల్లలపై దాడి



దిలీప్ అనే బాలుడికి కాలుపై కుక్కకాటు



వీధికుక్కల దాడిలో గాయపడిన మోహిత్

రేణిగుంట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. పాంచాలినగర్‌లో ఆరుగురు చిన్నారులను కుక్కలు కరిచాయి. నలుగురు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందగా, ఇద్దరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజెక్షన్లు వేయించుకున్నారు. కాగా అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమంటూ సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల మహిళా కార్యదర్శి ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. కుక్కల బెడద అధికంగా ఉందని ఇదివరకు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా నెల రోజుల వ్యవధిలో రెండు వందల మంది కుక్కల దాడిలో గాయపడ్డారని చెప్పారు. దీనిపై ఎంపీడీవో రవిచంద్ర మాట్లాడుతూ... కుక్కల బెడద తన దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ఎస్వీయూకు పరిశోధనా ప్రాజెక్టు మంజూరు



ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఆరోగ్యం, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానాల్లో పరిశోధనల బలోపేతానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధనా ప్రాజెక్టు మంజూరు చేసింది. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) - పార్టనర్‌షిప్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (పీఏఐఆర్) కింద ఈ ప్రాజెక్టుకు రూ. 15 కోట్లు కేటాయించింది. ఐదేళ్లపాటు కొనసాగే ప్రాజెక్టు మంజూరు పై ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు మంజూరు కావడం యూనివర్సిటీ పరిశోధనా సామర్థ్యానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. అధికారులకు ప్రాజెక్టు మంజూరు పత్రాలను అందజేశారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్విమ్స్ సహకారంతో ఎన్ఎస్ఎస్ చేపట్టిన ఈ శిబిరంలో 40 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు లలితకుమారి, డి.యువశ్రీ, వర్సిటీ మెడికల్ ఆఫీసర్ పద్మావతి పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) వేంకటేశ్వర స్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శనివారం హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు లభించింది. ఆదివారం శ్రీవారిని 67,408 మంది దర్శించుకోగా 16,597 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

పరిశోధనలతోనే దేశ సమగ్రాభివృద్ధి



సదస్సులో ప్రసంగిస్తున్న విజయ్‌కుమార్ సాహూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాణ్యతతో కూడుకున్న పరిశోధనలతోనే దేశం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఒడిశాలోని భువనేశ్వర్‌లో గల భారత ప్రభుత్వ ఎన్ఆర్‌డీసీ ఔట్‌రీచ్ ఆఫీస్ హెడ్ డాక్టర్ విజయ్‌కుమార్ సాహూ పేర్కొన్నారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో సెనెట్ హాల్లో 'రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ అండ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఫర్ యూనివర్సిటీ ఎక్సలెన్స్ అండ్ సస్టైనబులిటీ' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు.

డాక్టర్ బిజయ్‌కుమార్ సాహు మాట్లాడుతూ పరిశోధనలు నూతన దృక్కోణాల్లో సాగాలని కోరారు. మేధో సంపత్తిని పరిశోధనల కోసం వెచ్చించాలని సూచించారు. ఎస్వీయూ వీసీ అప్పారావు మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విలువైన పరిశోధనలు చేపట్టాలని సూచించారు. రీసెర్చ్ డీన్ నరసింహ మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బీవీ మురళీధర్, డీఎం మమత, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కాలేజీలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ రెడ్డి శేఖర్ పాల్గొని మాట్లాడారు. చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ఉద్యోగాలు పొందడంలో, ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో ఈ స్కిల్స్ ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. సుబ్రమణ్యం, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరుకు చెందిన గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు గ్రామంలోని గరుడ గ్రూపు సభ్యులు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గరుడ గ్రూపు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

తాత్కాలిక కల్వర్టులతో కలవరం

● వర్షం కురిస్తే ప్రయాణానికి భయం



కేకేవీపురం వద్ద కల్వర్టుకు పైపుల ఏర్పాటు



నెన్నూరు వద్ద తాత్కాలిక కల్వర్టు

రామచంద్రాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వస్తే ఆ కల్వర్టుల మీద ప్రయాణించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 2021లో భారీ వర్షానికి రాయలచెరువు ఉగ్రరూపం దాల్చడంతో నెన్నూరు, కేకేవీపురం వద్ద కల్వర్టులు కొట్టుకుపోయాయి. మండల కేంద్రంలో ప్రజలకు సంబంధాలు తెగిపోయాయి. అప్పట్లో తాత్కాలిక కల్వర్టులు(పైపులు) ఏర్పాటు చేశారు. ఇందుకు రెండు నెలలు పట్టింది. నెన్నూరు, కేకేవీపురం, గణేశ్వరపురం, సొరకాయలపాళెం, కమ్మపల్లె, రావిళ్ల వారిపల్లె పంచాయతీల్లోని 70కు పైగా గ్రామాల ప్రజలు ఆర్‌సీపురానికి చేరుకోవడానికి ఇదే మార్గం. లేకుంటే ఈ గ్రామాల ప్రజలు వడమాలపేట, తిరుపతి, చంద్రగిరి మీదుగా 30 కిలోమీటర్ల పైగా దూరం ప్రయాణించి ఆర్‌సీపురం చేరుకోవాలి. గత వైసీపీ ప్రభుత్వం తాత్కాలిక కల్వర్టులతోనే రెండున్నరేళ్లు గడిపేసింది. ఇప్పటికీ అదే పరిస్థితి. నక్కలవాగుకు అవతల ఉన్న ప్రజలు వర్షాకాలం వస్తే గత పరిస్థితి పునరావృతం అవుతోందేమోనని హడలిపోతున్నారు. శాశ్వత కల్వర్టులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై జనసేన ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదుచేస్తున్న జనసైనికులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులపై అసత్యప్రచారాలు చేస్తున్న వైసీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో ఈస్ట్ పోలీ స్టేషన్ సీఐ శ్రీనివాసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాలను పరిశీలించి విచారణ జరుపుతామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు. రాజారెడ్డి మాట్లాడుతూ దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో వైసీపీకి పుట్టగతులుండవని విమర్శించారు జనసేన నాయకులు సుమన్‌బాబు, ఆకేపాటి సుభాషిని, మునస్వామి, మధులత, రుద్రకిషోర్, జానకిరామిరెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

తిరుపతి

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ముఖ మండపం వద్ద ప్రధాన కలశంతోపాటు నవదుర్గలకు చిహ్నంగా తొమ్మిది కలశాలను స్థాపించారు. అనంతరం గణపతి హోమం నిర్వహించారు. పూర్ణాహుతి సమర్పణతో హోమపూజ ముగిసింది. అంతకు ముందు ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. బాలాత్రిపుర సుందరి అలంకారంలో మంగళవారం అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయ ఈవో జయకుమార్, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


గంగమ్మ ఆలయంలో నవదుర్గల కలశస్థాపన - బాలాత్రిపుర సుందరిదేవిగా అన్నపూర్ణదేవి, కొత్తవీధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి, కామాక్షి అమ్మవారిగా బొంతాలమ్మ

అన్నపూర్ణదేవి ఆలయంలో...

తిరుపతి అర్బన్(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి, కొత్తవీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో సోమవారం ఉదయం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సైతం శాస్త్రోక్తంగా ఇత్యాది కైంకర్యాలు గావించారు. రాత్రి అమ్మవారి మూలవర్లను పసుపుదారాల అలంకరణ, ఉత్సవమూర్తిని దీక్షాబంధన అలంకరణ చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బొంతాలమ్మ ఆలయంలో...

తిరుపతి(జీవకోన)(ఆంధ్రజ్యోతి): తిరుపతి కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో కామాక్షి అమ్మవారి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

పీజీఆర్‌ఎస్‌కు 382 ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 382 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 221 వినతులు ఉన్నాయి. ప్రతి అర్జీనీ సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. జేసీ తోపాటు డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్, సుధారాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గత వారం పీజీఆర్‌ఎస్‌ను రద్దు చేయడంతో ఈసారి అర్జీదారులు పెద్ద సంఖ్యలో రావడంతో కలెక్టరేట్ కిక్కిరిసింది.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ అనుబంధం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌తో కూడిన సదుపాయాలు కల్పించాలన్నారు. నామినీలుగా వ్యవహరిస్తున్న వారిని వీఆర్‌ఏలుగా రెగ్యులర్ చేయాలని కోరారు. అటెండర్, వాచ్‌మెన్, కంప్యూటర్ అసిస్టెంట్ ఆపరేటర్స్ ఖాళీల భర్తీలో 70 శాతం వీఆర్‌ఏలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐటీయూసీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, జిల్లా నాయకులు శివకుమార్, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటేష్, వీఆర్‌ఏల యూనియన్ నాయకులు వెంకటేష్, గీత, గజపతి, ప్రేమ్‌కుమార్, రామమూర్తి, లోక, వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సమస్యలు పరిష్కరించాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఏపీఎస్పీడీసీఎల్ విద్యుత్ జేఏసీ డిస్కం ఛైర్మన్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 1993లో రిక్రూట్ అయిన జేఎల్‌ఎం కార్మికులకు ఉన్న జీతాల వ్యత్యాసాన్ని సవరించాలన్నారు. డిస్కం కోఛైర్మన్ నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతుంటే తమపై తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు. ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అంతకుముందు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సంఘం నేతలు జయరాం, మురళీధర్, జయముని, వెలకటూరి గోపి, చలపతి, షణ్ముగం, వేలుమలై, మోహన్ పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు

నా పొలాన్ని వేరే వారి పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు



అయ్యా నాకు పూర్వీకుల నుంచి వచ్చిన భూమికి సంబంధించిన రికార్డులను తహసీల్దారు తారుమారు చేశారు. పద్మ అనే పేరుతో రిజిస్టర్ అయింది. నాకు ఆ పొలం తప్ప వేరే ఆధారం లేదు. దయుంచి పొలాన్ని నా పేరుతో రికార్డు చేయండి.

- రత్నయ్య, ప్రత్యేక ప్రతిభావంతుడు, పాతనాల పాడు, డక్కిలి మండలం

గిరి బలిజ జీవోను రద్దు చేయాలి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : గిరి బలిజ పేరుతో జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ దొమ్మరి కులం పేరును గిరి బలిజగా మారుస్తూ జీవో జారీ చేయడం సరికాదన్నారు. అందులో బలిజ అనే పదాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. బలిజ సేన నాయకులు బెల్లంకొండ సురేష్, కోకిల, శిరీష, కరుణానిధి, వాసు, సురేష్ పాల్గొన్నారు.

వైద్య వృత్తి దేవుడిచ్చిన వరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని దేవుడు ఇచ్చిన వరంలా భావించాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో అడుగుపెట్టిన వైద్య విద్యార్థులకు సోమవారం కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రోగులు డాక్టర్లను దైవసమానులుగా భావిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే దిశగా సేవలు చేయాలని కోరారు. నిస్వార్థ వైద్యసేవలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని సాధించవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, బీఎస్‌ఎన్‌మూర్తి, వైద్యాధికారులు కిరీటి, మాధవీలత, జగదీష్, రోజారమణి పాల్గొన్నారు. కాగా, స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో వైద్య వృత్తి ప్రాధాన్యతను, మెరుగైన వైద్యసేవలను అందించేందుకు పాటించాల్సిన మెలకువలను వైద్య విద్యార్థులకు వివరించారు. డీన్ అలోక్‌సచన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, ప్రిన్సిపాల్ ఉషాకళావత్, వైస్ ప్రిన్సిపాల్ ముత్తీశ్వరయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నగరంలో అలజడికి భూమన కుట్ర


● మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ధ్వజం


మాట్లాడుతున్న సుగుణమ్మ, చిత్రంలో ఆర్సీమునికృష్ణ, భాస్కర్ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోజుకో అసత్య ప్రచారంతో ఆధ్యాత్మిక నగరంలో అలజడి సృష్టించడానికి భూమన కరుణాకర్‌రెడ్డి వ్యూహరచన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అనుమానం వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ ఆయనకున నిత్యం తప్పుడు ప్రచారాలు, అసత్య ఆరోపణలు చేస్తుండడం పరిపాటిగా మారిందన్నారు.. తప్పులన్నీ చేసి ఇప్పుడు గొంతు కోసుకుంటాననంటూ కరుణాకర్‌రెడ్డి చెప్పడం అలిపిరిని అపవిత్రం చేయడమేనన్నారు. కర్పూరం చేతిలో వెలిగించుకుని కోనేటిలో మునిగితే చేసిన పాపాలు హరించుకుపోవన్నారు. దేవుడి శిక్షకు గురికాక తప్పదని చెప్పారు. ఇప్పటికైనా టీటీడీపై చేస్తున్న ఫేక్ ప్రచారాలు మానుకోవాలని సూచించారు. పరకామణి కేసుసీఐడీకీ అప్పగించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ప్రధాన నిందితునికి భూమన రాజకీయ రక్షణ కల్పించి దేవుడి సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. భక్తుల డబ్బులను లూటీ చేసి ఆస్తులుగా మార్చుకున్న తర్వాత తిరిగి ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీమునికృష్ణ, భాస్కర్ యాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పోటీలు ప్రతిభకు పదును పెడతాయి

● విశ్వంలో ఘనంగా యుఎస్‌వో ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్


బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈవో కుమార్, విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ వెల్లడించారు. యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూఎస్‌వో ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్ - 2025 స్థానిక జీవకోన విశ్వంనగర్‌లోని విశ్వం పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్పాట్ పెయింటింగ్, ప్రసంగం, గ్రూప్ డాన్స్, వన్ యాక్ట్ ప్లే, సైన్స్ ఫెయిర్ విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో, విశ్వం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఛైర్మన్ ఎన్.విశ్వనాథరెడ్డి, యుఎస్‌వో సెక్రటరీ జనరల్ నైనా జైన్, విశ్వం విద్యాసంస్థల డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యుఎస్‌వో వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, ట్రెజరర్ విజయ్ కుమార్ మెహ్రా, తిరుపతి జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త వి.చంద్రశేఖర్ నాయుడు, అపుస్మా నాయకులు రవీంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈఎస్‌ఐలో ఆధునిక పరికరాల ఏర్పాటుకు కృషి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్మికులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఈఎస్‌ఐ ఆస్పత్రిలో అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ ఎంఎస్ శ్యాంబాబు పేర్కొన్నారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సోమవారం ఆయన అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్యాంబాబు మాట్లాడుతూ సిటి స్కాన్‌తో పాటు మరికొన్ని వైద్య విభాగాలను ఏర్పాటు అవసరాన్ని గుర్తించామన్నారు. ఈమేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తీర్మానించామన్నారు. ఆర్‌ఎంవో ఈవీఎస్ ప్రసాద్, ఈఎస్‌ఐసీ బ్రాంచ్ మేనేజరు నాగమణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్, మంగళం రూరల్, ఆపరేషన్ల సెక్షన్ల పరిధిలోని తిమ్మినాయుడు పాళెం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మార్పు, మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా తిమ్మినాయుడు పాళెం, కూరపాటి రామచంద్రనగర్ సమీప ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని, సహకరించాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం మంగళం పీహెచ్‌సీలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జయంతి ఆధ్వర్యంలో పింక్ బస్సు ద్వారా బీపీ, షుగర్ పరీక్షలతోపాటు నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిహరిణి, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యభాను, ఎంపీహెచ్ఈవో మురళి, పీహెచ్‌ఎన్ బేబీరాణి, సీహెచ్‌వో ఎం.సంజన, ఏఎన్‌ఎంలు మంజుల, సుశీల పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


పవన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఈఈఈ విభాగం పరిశోధకుడు బొందు పవన్ కుమార్‌రెడ్డి డాక్టరేట్ పొందారు. మోడలింగ్ అండ్ అనాలసిస్ ఆఫ్ పవర్ కన్వర్టర్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ విత్ పీవీ అండ్ ఫ్యూయల్ సెల్స్ అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. డాక్టర్ వి.ఉషారెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడండి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కబ్జాదారుల నుంచి తన భూమిని కాపాడాలని తిరుపతి ఎస్టీవీనగర్‌కు చెందిన మల్లిశెట్టి లక్ష్మి కోరింది. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ తిరుమలనగర్‌లో 183 అంకణాలను 2016లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పింది. ఈ స్థలంలో రేకుల ఇల్లు నిర్మించి మహేష్ నాయుడు అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చినట్లు పేర్కొంది. సదరు వ్యక్తి బాడుగ చెల్లిస్తూ స్థలాన్ని కబ్జా చేసి దౌర్జన్యానికి దిగడంతో 2024లో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఆ స్థలాన్ని చదును చేసి ఆక్రమిస్తుండడంతో వెళ్లి ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగారన్నారు. డీఎస్పీ ఆదేశించినా పనులు ఆపడం లేదన్నారు. ఎస్పీ, ఎమ్మెల్యే స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది.

నగరపాలక సంస్థ పీజీఆర్‌ఎస్‌కు 37 వినతులు

తిరుపతి, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 37 వినతులు వచ్చాయి. డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ తమ డివిజన్లలో సమస్యలపై వినతులు ఇచ్చారు. వీవీ మహల్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని, కేటీ లేఔట్‌లో ఆకతాయిలు రోడ్లపై మద్యం తాగుతూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని, సుందరయ్య నగర్‌లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, నెహ్రూ నగర్‌లో యూడీఎస్ ఓవర్ ఫ్లో అవుతోందని, కొరమేనుగుంటలో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరిం టెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టండి

తిరుపతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే రైల్వేస్టేషన్, బస్టాండ్, వసతిగృహ సముదాయాల వద్ద పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది సిబ్బందితో పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. పాడైన ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టి పూల కుండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్ ఉన్నారు.

తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా గంగాధర్ రెడ్డి


గంగాధర్ రెడ్డిని అభినందిస్తున్న ఈఈలు, డీఈఈలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా సి.గంగాధర్ రెడ్డి సోమవారం పాత తిరుచానూరు రోడ్డులోని ఈఈ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి టౌన్ డివిజన్ ఈఈగా ఉన్న వి.చంద్రశేఖరరావు తిరుపతి సర్కిల్ ఎస్ఈగా పదోన్నతిపై వెళ్లారు. ఆ స్థానంలోకి డీపీఈ విభాగంలో ఉన్న సి.గంగాధర్ రెడ్డిని బదిలీ చేస్తూ సీఎండీ కె.సంతోషరావు ఉత్తర్వులు జారీచేశారు. ఆయన సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈఈలు శ్రీనివాసులు, దామోదర, డీఈఈలు ఆంజనేయులు, మునిప్రసాద్, జయప్రకాష్, రమేష్ బాబు, ఏఈలు, ఏఏవోలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ధ్యాన మహాయజ్ఞం


పీఎంసీ సభ్యులు, పిరమిడ్ మాస్టర్లను సన్మానం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మహతి ఆడిటోరియంలో ఏడు రోజులుగా జరుగుతున్న ధ్యాన మహాయజ్ఞం సోమవారం ముగిసింది. ఆఖరి రోజున శ్రీవిద్వాన్ సుధాంశు కుట్టి బృందం నిర్వహించిన సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం అలరించింది. ధ్యాన మహాయజ్ఞం విజయవంతానికి కృషి చేసిన వారిని ఘనంగా సన్మానించారు. పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు మూడు గంటలపాటు సామూహిక ధ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మహాయజ్ఞం వైస్ ఛైర్మన్ సంగీతబాబు, పీఎంసీ ట్రస్టు ఛైర్మన్ దాట్ల హనుమంతరాజు, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్ జక్కా రాఘవరావు, కంచి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

గూడూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా తన కార్యాలయాయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 19 అర్జీలు అందాయి. ఇందులో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయి. అలాగే సంక్షేమ పథకాలు అందలేదని కొందరు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెకు పెళ్లి సందర్భంగా పసుపు, కుంకుమల కింద ఇరవైనాలుగున్నర సెంట్లు భూమిని రాసిచ్చానని, ప్రస్తుతం అది రెవెన్యూ రికార్డుల్లో నోషనల్ ఖాతాగా నమోదై ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని, నాలుగేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించలేదని కోట మండలం గూడలికి చెందిన మండి వెంకటేశ్వర్లురెడ్డి ఫిర్యాదు చేశారు. తన తండ్రి కొవిడ్ సమయంలో చనిపోయాడని, పెన్షన్ కోసం తన తల్లి భూదేవమ్మ ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా, భూమి ఎక్కువ ఉందంటూ పెన్షన్ ఇవ్వలేదని బాలయపల్లి మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన బాపనపల్లి కవిత చెప్పారు. తమది కాని భూమి రికార్డుల్లో నమోదు కావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదని, ప్రస్తుతం తన తల్లి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తప్పుగా నమోదైన భూమిని తొలగించి న్యాయం చేయాలని కవిత విజ్ఞప్తి చేశారు.

వేనాడు, పేర్నాడు రోడ్లకు అనుమతులు మంజూరు చేయండి

డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే విజయశ్రీ వినతి



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గం పులికాట్ తీర ప్రాంతంలోని వేనాడు, పేర్నాడు రోడ్లకు అనుమతులు మంజూరు చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు విన్నవించారు. సోమవారం అమరావతిలోని శాసన సభలో డిప్యూటీ సీఎంను ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కలిసి పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా వేనాడు, పేర్నాడు రోడ్ల దుస్థితిని వివరించారు. సుమారు 15 గ్రామాలున్న ఈ ప్రాంతం పులికాట్ సరస్సు మధ్యలో ఉండటంతో చిన్న అభివృద్ధి పనికైనా అటవీశాఖ వన్యప్రాణి విభాగం అధికారులు అభ్యంతరం చెబుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార న్నారు. దశాబ్దాలుగా మట్టి రోడ్డులోనే ప్రజలు ప్రయాణించాల్సి వస్తోందన్నారు. అలాగే దొరవారిసత్రం మండలం మీజూరు వద్ద చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి సైతం ఇవే అడ్డంకులు ఉన్నాయని, అక్కడ భూగర్భజలాలు సైతం ఉప్పునీళ్లుగా మారిపోయాయన్నారు. చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే సమీప గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని చెప్పుకొచ్చారు. అక్కడ ప్రజల దుస్థితిని తెలిపే ఫొటోలను, నివేదికలను, వినతిపత్రాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. వీటిని పరిశీలించిన డిప్యూటీ సీఎం త్వరలోనే సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఇప్పించేలా ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఆరోగ్యకర మహిళతో శక్తివంతమైన కుటుంబం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ హేమ

వాకాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర మహిళ శక్తివంత మైన కుటుంబాన్ని, సమాజాన్ని నిర్మించగలదని డాక్టర్ హేమ అన్నారు. మండలంలోని కొండాపురం అంగన్‌వాడీ పాఠశాలలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వస్థనారీ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాల్లో గుండె జబ్బులు, క్యాన్సర్‌కు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నా మన్నారు. రక్తహీనత, పోషకాహారంపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికా హార పదార్థాల స్టాల్స్‌పై మహిళకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌నాయుడు, అంగన్‌వాడీ సిబ్బంది శిరీషా, సాయమ్మ, శాంతి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పెళ్లకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని నాయుడుపేట క్లస్టర్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పెళ్లకూరుమిట్ట గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రోజువారి ఆహారంలో తాజా ఆకు కూరలు, కూరగాయలతో పాటు సీజనల్ పండ్లు తీసుకోవాలన్నారు.

ఎంపీడీవోకు సత్కారం



ఉమామహేశ్వర్‌రావును సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు, సిబ్బంది

వాకాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాకాడు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై చిట్టమూరు ఎంపీడీవోగా బదిలీపై వెళ్తున్న ఉమామహేశ్వర్‌రావును ఎంపీడీవో శ్రీనివాసులు, అధికారులు సత్కరించారు.

వెంకటగిరి మున్సిపల్ డీఈ మృతిపై విచారణ జరపాలి

మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ డీఈ రాయపూడి శ్రీధర్ మృతిపై విచారణ జరపాలని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మృతుడి సోదరుడు పూర్ణచంద్ర కళాధరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. శ్రీధర్ శరీరంపై గాయాలతో అద్దెకు ఉంటున్న ఇంట్లో గత నెల 20న అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. శ్రీధర్ భార్య సరళశ్రీ తన సోదరి పద్మశ్రీ, అక్క కుమారుడు సిద్ధూ, మరికొందరితో కలిసి హత మార్చిందనే అనుమానాలున్నాయని ఆరోపించారు. శ్రీధర్ మృతి అనుమానాస్పదమని కమిషనర్ ధృవీకరించినా పోస్టుమార్టం చేయించకుండా విజయవాడకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారని చెప్పారు. సమగ్ర విచారణ జరిపి, నిజనిజాలను నిగ్గుతేల్చాలని శ్రీధర్ సోదరుడు కోరారు. సమావేశంలో చప్పిడి వెంగళయ్య, కాలం హరికృష్ణ, రవిరాజు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి



గుడూరు: బాలత్రిపురసుందరీదేవిగా విజయదుర్గాదేవి - సూళ్లూరుపేట: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి



చిల్లకూరు: రాజరాజేశ్వరిగా ముత్యాలమ్మ - సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి



నాయుడుపేట: ప్రత్యేక అలంకరణలో మూకాంబికాదేవి - వాకాడు: చతుర్భుజ మహాలక్ష్మి



గొల్లలములువు నుంచి సారె తీసుకొస్తున్న గ్రామస్తులు - చెంగాలమ్మ ఆలయంలో కలశ స్థాపన చేస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి

కలశ స్థాపనతో శరన్నవరాత్రులు ప్రారంభం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో దేవినవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం వేదపండితులు, మంత్రోచ్చరణల నడుమ కాళంగి నది జలాలు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కలశ స్థాపన చేశారు. అనంతరం సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి చేతుల మీదుగా ఆఖండ జ్యోతిని వెలిగించి అమ్మవారి అంతరాలయంలో పెట్టి ఉత్సవాలను ప్రారంభించారు. తరువాత ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పుట్టినిల్లు గొల్లలములువు నుంచి మేళతాళాలు. బాణసంచా పేలుళ్ల నడుమ సారె తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. శింగన ఓబుల్‌రెడ్డి, పద్మజారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, వేనాటి సురేష్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, నాపా మునిరాజా, గండవరం రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కన్యకా పరమేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉరిమి బాలాజీ, అలవల వెంకటసుబ్బారావు, బ్రహ్మానందం దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గూడూరు: పట్టణంలోని సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక గ్రామదేవత తాళమ్మ ఆలయంలో విజయదుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ స్వామి పూజలు నిర్వహించి కలిశాన్ని నెత్తిపై ఉంచుకుని సాయిసత్సంగ నిలయానికి తీసుకొచ్చారు. అదేవిధంగా పట్టణంలోని నారాయణమ్మపెంరంత్రాళ్లు, మహాలక్ష్మమ్మ, కన్యకా పరమేశ్వరి, రాజరాజేశ్వరిదేవి, గంగమ్మదేవి, బజారుకలిశం తదితర ఆలయాల్లో అమ్మవారి కలశ స్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

చిల్లకూరు: తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని ఆదిలక్ష్మీదేవిని సౌభాగ్యలక్ష్మిగా అలంకరించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకాపరమేశ్వరికి స్వర్ణ కవచ అలంకారం, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో వెలసిన కాత్యయనీదేవిని అర్ధనారీశ్వరిగా, వెంకటేశ్వరస్వామిని మత్స్యావతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: విద్యానగర్‌లోని విద్యాగణపతి ఆలయ ప్రాంగణంలో గల లక్ష్మీదేవిని బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. తన్నమాల వెంకటకృష్ణారెడ్డి, గీతమ్మ దంపతులతో పాటు డాక్టర్ హస్వంత్‌రెడ్డి ఉభయదాతలుగా వ్యవహరించారు. అదేవిధంగా కోటలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని భవానీదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్యసంఘ నాయకులు కలశ పూజ చేశారు. గ్రామదేవత కోటమ్మను బాలత్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూకాంబికా దేవి, దుర్గాదేవి, మానసాదేవి, అంకమ్మ, గ్రామదేవత పోలేరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాకాడు: సిద్ధిగుంటపాళెంలోని చతుర్భుజ మహాలక్ష్మి ఆలయంలో ప్రధానార్చకులు పవన్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, గణపతిపూజ, కుంకుమార్చన నిర్వహించారు. సురేంద్రబాబు, సౌజన్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.



వెంకటగిరి: అర్ధనారీశ్వరి అలంకారంలో కాత్యయనీదేవి, మత్స్యావతారంలో వెంకటేశ్వరస్వామి, స్వర్ణ కవచంలో కన్యకాపరమేశ్వరి - కోట: బాలత్రిపుర సుందరిదేవిగా లక్ష్మీదేవి, కోటమ్మ, భవానీదేగా కన్యకాపరమేశ్వరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శ్రీనగర్ కాలనీ, పార్కువీధి, కచ్చేరివీధి, పరమేశ్వరినగర్, బ్రాహ్మణవీధి, గణపతి నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండవని పట్టణ ఏఈ మోహిని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం

చిల్లకూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ సూపర్ వైజర్ రేణుకమ్మ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులకు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, ప్రభావతి, పెంచలమ్మ, సులోచన, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనిగుంటలో ఉచిత వైద్య శిబిరం

తడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చేనిగుంటలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రారంభించిన స్వసక్తి నారీ పరివార్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకాటి బుజ్జమ్మ, తడ పీఏసీఎస్ అధ్యక్షుడు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చిల్లకూరు తేజారెడ్డి, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు రమేష్, బాలసుబ్రహ్మణ్యం, మనోజ్, పీహెచ్‌సీ డాక్టర్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామసుందరపురంలో...

కోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. కోట, చిట్టేడు ప్రభుత్వాస్పత్రుల వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, సుహాసిని, షంషుద్దీన్, డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

పెళ్లకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుండడంతో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారయణరెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలోని రైతులకు సరిపడే యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నేత్రదానం



రామ్మూర్తి (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సర్వారెడ్డి కండ్రిగకు చెందిన జమ్మి రామ్మూర్తి(85) మరణాంతరం ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలను దానం చేశారు. సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు అందజేశారు.


ఓట్ల చోరీతోనే మోదీకి అధికారం: కాంగ్రెస్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఓట్ల చోరీతోనే అధికారం చేజిక్కించుకున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురం బాబు ఆరోపించారు. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా అవకతవకలకు నిరసనగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మామండూరు వెంకటాచలపతి, భాస్కర్‌రెడ్డి, బాలరాజురెడ్డి, జానకి రాము, వెంకటరత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాయుడుపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. పట్టణంలోని రామకృష్ణాపురానికి చెందిన జూనేద్ ఈనెల 14వ తేదీ మద్యంలో గడ్డిమందు కలుపుకొని ఆత్మహత్యయత్నం చేశారు. స్థానికులు, బంధుమిత్రులు గమనించి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జూనేద్(22) మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి గ్రామోత్సవాలు



ఆంజనేయస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో బేతాళనృత్యాలు

గూడూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆంజనేయస్వామి గ్రామోత్సవాలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వైభవోపేతంగా కొనసాగాయి. ఆదివారం పట్టణంలోని వీధుల్లో స్వామివారి జెండాలను ట్రాక్టర్‌పై అలంకరించి పోటాపోటీగా గ్రామోత్సవాలు నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి జెండాలను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్లపై ఉంచి తీన్‌మార్ బ్యాండ్లు, తెనాలిబ్యాండ్లు, బేతాళ నృత్యాలు, యువత చిందుల నడుమ సోమవారం ఉదయం ఊరేగించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరకామణి వివాదంపై

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించండి

- సీజేఐ గవాయ్‌కు ఎంపీ గురుమూర్తి లేఖ

తిరుపతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి వివాదంపై విచారణ కోసం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి అధ్యక్షతన జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైసీపీకి చెందిన తిరుపతి ఎంపీ గురుమూర్తి సీజేఐ బీఆర్ గవాయ్‌కు సోమవారం లేఖ రాశారు. తిరుమల పరకామణి చుట్టూ అలుముకున్న వివాదంపై సుప్రీంకోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. ఎలాంటి ఆధారాలనూ చూపకుండా, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించకుండానే దొంగతనం, ఆలయ కానుకల దుర్వినియోగం వంటి తీవ్రమైన ఆరోపణలను ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి రాజకీయ ప్రతీకార చర్యలతో తిరుమల ఆలయ పవిత్రత దెబ్బతింటోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో అయితే శ్రీవారి ప్రతిష్ట దెబ్బతినకుండా, భక్తుల విశ్వాసాలను తిరిగి నిలబెట్టేలా విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

సత్యవేడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని స్కిల్ డెవలెప్‌మెంట్ కేంద్రంలో ఈనెల 23న మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, శ్రీతులసి ఆయుర్వేద ఆస్పత్రి సంయుక్తంగా ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరుగుతుందని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించగా భక్తులు దర్శించుకున్నారు.

ఆర్థిక సాయం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరుకు చెందిన గంగాధర్ అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు గ్రామంలోని గరుడ గ్రూపు సభ్యులు రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గరుడ గ్రూపు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

పుత్తూరు వార్తలు



ఆదిపరాశక్తిగా ద్రౌపది దేవి - చాముండేశ్వరి అలంకరణలో కామాక్షమ్మ - బాల త్రిపుర సుందరిగా నాగాలమ్మ

ఆది పరాశక్తి అలంకరణలో ద్రౌపది అమ్మవారు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుత్తూరు పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారిని ఆదిపరాశక్తి అలంకరణలో పూజలు నిర్వహించారు.ఉభయదారులుగా ఆర్‌కే టెక్స్‌టైల్స్ వ్యవహరించింది. ఉత్సవ కమిటీ చైర్మన్ క్రిష్టప్ప మొదలి, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, అర్చకుడు మోహన్ పాల్గొన్నారు. అలాగే సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మను చాముండేశ్వరిగా అలంకరించారు. ఆలయ చైర్మన్ దిలీప్, ఈవో విజయకృష్ణ, సభ్యులు పార్తిబన్, శ్రీధర్, పూజిత, చిలకమ్మ, ఉభయదారులుగా పార్థసారథి కుటుంబీకలు వ్యవహరించారు. రైల్వే క్వార్టర్స్‌లో కొలువై ఉన్న నాగాలమ్మను బాల త్రిపుర సుంద రిగా అలంకరించారు. ఉభయదారులుగా కృష్టకుమారి, వర్మ దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్‌చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్ చక్రి, ఆలయ నిర్వాహకులు ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.



వడమాలపేట (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అర్చకుడు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. వేదమాంత్రాలతో కలశ స్థాపన చేశారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామ అర్చన, కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారిని దీక్షా బంధన రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

విద్యుత్ రాయితీ అమలు చేయండి

పుతూరు,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మరమగ్గ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ రాయితీని అమలు చేయాలని కోరుతూ పుత్తూరు విద్యుత్ డీఈ దేవదానంకు సోమవారం పట్టణంలోని చేనేత కార్మికులు వినతి పత్రాన్ని అందించారు. చేనేత కార్మికులకు నెలకు 500 యూనిట్లు రాయితీని ఆగస్టు నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఈ మేరకు సెప్టెంబరు బిల్లులో రాయితీ రాలేదని కార్మికులు అధికారు ల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని, వచ్చిన వెంటనే సర్దుబాటు చేస్తామని డీఈ స్పష్టం చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కనకాచలంపై దసరా నవరాత్రులు ప్రారంభం




పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు - దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మొదటి రోజు ఆలయంలో కలశాన్ని ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ కలశంతో ఆలయ పండితులు ఆలయప్రాకార ప్రదక్షిణలు నిర్వహించారు. మూలవిరాట్ కనకదుర్గమ్మకు పలురకాల అభిషేకాలు చేపట్టారు. మహిళలు పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. ఈవో బాపిరెడ్డి మాట్లాడుతూ... భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కొండ ఎక్కలేని భక్తుల కోసం కొండ కింద అమ్మవారి ఉత్సవమూర్తిని ఏర్పాటు చేశామన్నారు.

రేణిగుంటలో కుక్కల బీభత్సం

- పాంచాలినగర్‌లో ఆరుగురు పిల్లలపై దాడి



పంచాయతీ కార్యాలయం ముందు సీపీఎం నాయకుల నిరసన



వీధికుక్కల దాడిలో గాయపడిన మోహిత్



దిలీప్ అనే బాలుడికి కాలుపై కుక్కకాటు

రేణిగుంట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. పాంచాలినగర్‌లో ఆరుగురు చిన్నారులను కుక్కలు కరిచాయి. నలుగురు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందగా, ఇద్దరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంజెక్షన్లు వేయించుకున్నారు. కాగా అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమంటూ సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల మహిళా కార్యదర్శి ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. కుక్కల బెడద అధికంగా ఉందని ఇదివరకు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదన్నారు. ఫలితంగా నెల రోజుల వ్యవధిలో రెండు వందల మంది కుక్కల దాడిలో గాయపడ్డారని చెప్పారు. దీనిపై ఎంపీడీవో రవిచంద్ర మాట్లాడుతూ... కుక్కల బెడద తన దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ఉపరాష్ట్రపతి పర్యటనపై కలెక్టర్ సమీక్ష



రేణిగుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ వెంకటేశ్వర్ భద్రతా ఏర్పాట్లపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరుపతి విమానాశ్రయంలో ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఉపరాష్ట్రపతి తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ఆ మేరకు భద్రతా ఏర్పాట్లలో ఎక్కడా సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహర్‌చారి, ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరానికి స్పందన



ఆధార్ నమోదు చేసుకున్న గిరిజన పిల్లలతో అధికారులు

ఏర్పేడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ శిబిరాన్ని ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే శిబిరంలో ఆధార్ కార్డు పొందవచ్చు. ఏర్పేడు మండలంలో గిరిజనులకు ఆధార్‌కార్డులు ఇప్పించాలని జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆధార్‌క్యాంపు ఏర్పాటు చేశారు. సోమవారం పలు గ్రామాల నుంచి గిరిజన బాలబాలికలకు ఆధార్‌కేంద్రానికి వచ్చి ఆధార్‌కార్డులకు నమోదు చేసుకున్నారు. జయలక్ష్మి, శిరీష, చంద్రశేఖర్, రమణ, చంద్రశేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమాలో జీరో శాతం జీఎస్టీపై హర్షం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా పాలసీలకు కేంద్రప్రభుత్వం జీఎస్టీ ఎత్తివేయడంపై ఎల్ఐసీ ఏజెంట్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. జీఎస్టీ ఎత్తివేయడంతో పాలసీదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సంఘం డివిజనల్ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి సతీష్‌బాబు, నారాయణస్వామి, బాబురావు, ఈశ్వర్, మణి, అమృత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు వి.మస్తానయ్య అసెంబ్లీ ఆవరణలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అదే విధంగా మంత్రి లోకేశ్‌ను కూడా మర్యాదపూ ర్వకంగా కలిశారు.

ఘనంగా గంగ జాతర



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరులో గంగ జాతర ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయం ఏదుట గంగ దేవత ముగ్గు ఆకట్టుకుంది. ఉదయం మహిళలు పొంగళ్లు పెట్టి, అంబళ్లు తీసుకువచ్చి భక్తులకు పంపిణీ చేశారు. కారణిమిట్ట గ్రామానికి చెందిన బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పతాకావిష్కరణ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో కొలువై ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు సోమవారం వైశ్య పతాకా ఆవిష్కరణతో మొదలయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. నేటినుంచి అమ్మవారి మూలమూర్తి, ఉత్సవమూర్తి ప్రత్యేక అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ జూలుగంటి మురళీమోహన్ గుప్తా, సభ్యులు, మహిళా మండలి, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళల ఆరోగ్యం కోసం కృషి చేస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గాజులపెళ్లూరులో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యం బాగుంటే ఆ కుటుంబంతో పాటు సమాజం బాగుంటుందన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌కుమార్, మేదర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సుందరయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు హరిబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరణం తల్లీ శైలపుత్రీ..

వేడుకగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు

పలు ఆలయాల్లో బాల త్రిపుర సుందరిగా భక్తును కటాక్షించిన అమ్మవార్లు







బొమ్మలకొలువలో శైలపుత్రిగా దర్శనమిస్తున్న జ్ఞానప్రసూనాంబ అమ్మవారు - స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అలంకారంలో ఆలయంలోని కనకదుర్గమ్మ - కలశస్థాపన అలంకారంలో జ్ఞానప్రసూనాంబ - రాజరాజేశ్వరి అలంకరణలో పల్లికొండేశ్వరుడి ఆలయంలో సర్వమంగళా దేవి - బాల త్రిపుర సుందరిగా కామాక్షిదేవి అమ్మవారు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజు సోమవారం పలు అలంకారాల్లో అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. అశ్వని నక్షత్రంలో కలిపివచ్చే మాసాన్ని ఆశ్వయుజ మాసంగా పిలుస్తుంటారు. ఆశ్వయుజ మాసం ఆరంభం పాడ్యమి రోజు నుంచి నవరాత్రులను భక్తులు ఎంతో శ్రద్ధతో ఆచరిస్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దసరా ఉత్సవాలకు శాస్త్రోక్తంగా వేదపండితులు కలశ స్థాపన చేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఆగమోక్తంగా కలశస్థాపన చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మ శైలపుత్రిగా, జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి కలశస్థాపన అలంకారంలో, ఆలయంలో ఉత్సవాలను ఏర్పాటు చేసిన బొమ్మలకొలువులో శైలపుత్రిగా దర్శనమిచ్చారు. సాయంత్రం జ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సమూర్తికి ఆలయంలో ఊరేగింపు నిర్వహించారు. ఇక ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలోని వేడాంలో దక్షిణ కాళికాదేవి స్వర్ణకవచాలంకృత ఆనంద భైరవి, పానగల్‌గంగమ్మ ప్రత్యేక అలంకారం, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి తిరువారూరు త్యాగరాజస్వామి, కమలంబికాదేవి అలంకారంలో, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి బాల వాసవిగా, పొన్నాలమ్మ అమ్మవారు బాల్రతిపురసుందరిగా, తెట్టులోని నల్లగంగమ్మ, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, బీపీఅగ్రహారం గంగమ్మ, పూసలవీధిగంగమ్మ, శీతలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ, పిచ్చాటూరు రహదారిపై కొలువైన బంగారమ్మ, భాస్కరపేటలో కొలువై ఉన్న చాముండేశ్వరిదేవి బాల త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.

పల్లికొండేశ్వర ఆలయంలో

నాగలాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సర్వమంగళాదేవి రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తీకేశన్ గురుకుల్, ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళ్యాణ వీరభద్రస్వామి ఆలయంలో విజయదశమి వేడుకల్లో భాగంగా ఆలయంలోని సర్వమంగళాదేవి తొలిరోజు బాల్రతిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో, అంబూరులో కొలువై ఉన్న కామాక్షమ్మ ఆలయంలో అమ్మవార్లు బాల్రతిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

బాల త్రిపుర సుందరిగా కామాక్షమ్మ

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసనాథ కోనలో కొలువై ఉన్న కామాక్షమ్మ సమేత కైలాసనాథ స్వామి ఆలయంలో సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలను కలశ స్థాపనతో ప్రారంభించారు. ఉదయం ఆలయంలో లలితా సహస్రనామం పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాల త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో కృష్ణనాయక్, ఉత్సవ కమిటీ చైర్మన్ వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో శరవన్నరాత్రి ఉత్సవాలకు సోమవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 8.30 గంటలకు నిర్వహించే అభిషేకంలో పాల్గొనవచ్చునని తెలిపారు.










ఆనందభైరవిగా దక్షిణ కాళికాదేవి- శైలపుత్రిగా ఏడుగంగమ్మల అమ్మవారు - తిరువారూరు త్యాగరాజస్వామి, కమలంబికా అలంకారంలో బజారువీధి కన్యకాపరమేశ్వరి - పొన్నాలమ్మ ఆలయంలో బొమ్మల కొలువు- బంగారుచీర అలంకరణలో బజారువీధి కన్యకాపరమేశ్వరి - బాల్రతిపురందరిగా పొన్నాలమ్మ- బీపీఅగ్రహారంలో బాల్రతిపురసుందరిగా పెద్దగంగమ్మ, చిన్నగంగమ్మ





ప్రత్యేక అలంకారంలో శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మ - బాల త్రిపుర సుందరిదేవిగా సత్యవేడులోని సర్వమంగళాదేవి, వరదయ్యపాళెం చెంగాళమ్మ, నారాయణవనం మూలస్థాన ఎల్లమ్మ

వైభవంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు



ఏర్పేడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధానంగా గుడిమల్లం శ్రీవల్లీ దేవి సమేత పరశురామేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిమల్లం ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ గిరినాయుడు దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. చిందేపల్లి సిద్దేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

గుర్తింపు కార్డుల కోసం రోడ్డెక్కిన డప్పు కళాకారులు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న డప్పు కళాకారులు

సత్యవేడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను అందించాలని సంఘం జిల్లా నాయకుడు సంక్రాంతి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం ఆధ్వర్యంలో డప్పు కళాకారుల ప్రథమ మహాసభ నిర్వహిం చారు. కార్యక్రమంలో వెంటకయ్య మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేయడంలో డప్పు కళాకారుల పాత్ర కీలకమన్నారు. డప్పు కళాకారులకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసిందని గుర్తు చేశారు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అర్హులైన డప్పు కళాకారులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించి విస్మరించిందన్నారు. రీ సర్వే పేరుతో కళాకారలు పింఛన్లు తొలగించరాదని కోరారు. కొత్త డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అర్హులైన వారికి సెల్ఫ్ డిక్లరేషన్‌తో సచివాలయాల్లోనే పింఛన్లను మంజూరు చేయాలని, పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.7వేలకు పెంచాలని, వయోపరిమితి 50 నుంచి 40 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం కల్యాణ మండపం నుంచి ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని ఎంపీడీవో త్రివిక్రమరావుకు వినతి పత్రం అందించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, సీఐటీయూ ప్రాంతీయ కార్యదర్శి ఎం.రమేష్, విజయభాస్కర్, క్రిష్ణయ్య, మునస్వామి, మురళి, విఘ్నేష్, అనిల్, దినకరన్ తదితరులు పాల్గొన్నారు.

వినతులను త్వరగా పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసిన వినతులను వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో ఆమె సమీక్షించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పర్కిరించాలన్నారు. భూసమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండల సర్వేయర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై అవగాహన



కేవీబీపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులపై ఐటీఈఎస్ ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. దసరా సెలవుల్లో సమయం వృథా చేయకుండా కంప్యూటర్, ఫొటోగ్రఫీ తదితరాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఐటీఈఎస్ ఉపాధ్యాయుడు మురళిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు జెర్కిన్లు అందజేత



పోలీసులకు జర్కిన్లను అందజేస్తున్న ఎస్ఎస్ సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1టౌన్ పోలీసులకు సోమవారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సంస్థ జెర్కిన్లు, 30 లాఠీలను సీఐ గోపికి అందించింది. వర్షాకాలంలో పోలీసులు ఇబ్బందులు పడకుండా జెర్కిన్లు ఇవ్వడం సంతోషకరమన్నారు. వీరు గతంలో ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్లు, రేడియం జాకెట్లు, లైటింగ్ బాటెనన్స్‌ను కూడా ఇచ్చారన్నారు. వీరికి పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా డాక్టర్ రమాదేవి జన్మదిన వేడుకలు



రేణిగుంట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమర ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి 61వ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో ఆస్పత్రి చైర్మన్ గౌరినేని ప్రసాద్, వైద్యసిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో భాగ్యలక్ష్మి, పీఆర్వో మునినాథం, వైద్యులు వరుణ్, శాలిని, రవికుమార్, అనుపమ, వెంకటశివకృష్ణ, మునికృష్ణ, విజయేంద్రరెడ్డి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.